సీఎంని కలిసిన మర్రి పురురవరెడ్డి



బన్సీలాల్‌పేట్: మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి తనయుడు మర్రి పురురవరెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శుక్రవారం కలిశారు. జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో సీఎంని కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సన్మానించారు. మాజీ సీఎం మర్రి చెన్నారెడ్డి 105వ జయంతికి హాజరుకావాల్సిందిగా ఈ సందర్భంగా పురురవరెడ్డి సీఎంకు విజ్ఞప్తి చేశారు.

కంటోన్మెంట్ అభివృద్ధికి హామీ



విలేకరులతో మాట్లాడుతున్న సోమశంకర్

కంటోన్మెంట్: కంటోన్మెంట్ అభివృద్ధికి ప్రభుత్వం సహకారం అందిస్తుందని, ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని కంటోన్మెంట్ బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ సోమ శంకర్ వెల్లడించారు. శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో బోర్డు సమావేశం జరిగింది. అనంతరం విలేకరులతో సోమ శంకర్ మాట్లాడుతూ.. సీఎంని కలిసి ఆర్మీ, కంటోన్మెంట్ సమస్యలపై చర్చించామన్నారు. ఈ సందర్భంగా కంటోన్మెంట్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించే అంశంపై సీఎం సానుకూలంగా స్పందించినట్టు చెప్పారు.

అడ్డగుట్టలో ప్రజాస్వామ్య విజయోత్సవ సభ

అడ్డగుట్ట: అడ్డగుట్ట వ్యవస్థాపకుడు ఎస్.యాదగిరి ఆధ్వర్యంలో శుక్రవారం అంజయ్య బొమ్మ వద్ద ప్రజాస్వామ్య విజయోత్సవ సభ జరిగింది. సభలో ప్రొఫెసర్ కోదండరాం ముఖ్యతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ కోసం ఉద్యమించిన పోరాట యోధులకు గత ప్రభుత్వంలో ఎలాంటి గుర్తింపు దక్కలేదని ఆయన చెప్పారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలకు అన్యాయం జరిగిందన్నారు. ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో గద్దర్ కుమార్తె వెన్నెల, మాజీ కార్పొరేటర్ ఆదం ఉమాదేవి, నగేశ్, నందికంటి రవి, సత్తెమ్మ, తెలంగాణ ఉద్యమకారులు పాల్గొన్నారు.

కంట్రీ క్లబ్ మెంబర్‌షిప్ కార్డు ఆవిష్కరణ



సనత్‌నగర్: సంక్రాంతిని పురస్కరించుకుని బేగంపేటలోని కంట్రీ క్లబ్ వీఐపీ ఇంటర్నేషనల్ 24 మెంబర్‌షిప్ కార్డును ఆవిష్కరించారు. అంతర్జాతీయ పర్యాటక ప్రాంతాలకు వెళ్లేలా ఈ మెంబర్‌షిప్ కార్డును రూపొందించామని కంట్రీ క్లబ్ చైర్మన్ రాజీవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఇండియన్ ట్రెడిషనల్ థీమ్‌తో నిర్వహించిన నృత్యాలు అలరించాయి. అనంతరం రాజీవ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ వీఐపీ మెంబర్‌షిప్ పొందిన వారికి థాయిలాండ్, వియత్నాం, ఇండోనేసియా, బ్యాంకాక్, పట్టాయా, ఫుకెట్, బాలీ, హనోయి లాంటి ప్రదేశాలకు ఉచితంగా వెళ్లేలా డిజైన్ చేశామని చెప్పారు.

అక్రమ పార్కింగ్‌పై కొరడా



బౌద్ధనగర్: రోడ్డుపై అక్రమంగా వాహనాలు నిలిపితే చర్యలు తప్పవని ఈస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ ఎస్. సంపత్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం సీతాఫల్‌మండి, వారాసిగూడ, బౌద్ధనగర్ ప్రధాన కూడళ్లలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్లపై అక్రమంగా పార్క్ చేసిన వాహనాలను తొలగించడంతో పాటు ఫైన్‌లు విధించారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ.. ట్రాఫిక్ ఫ్రీ నగరానికి వాహనదారులు సహకరించాలని కోరారు. స్పెషల్ డ్రైవ్‌లో చిలకలగూడ ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులు, ఏఎస్సై మహేందర్ ఉన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. టమాటా 19, నల్ల వంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 45, పచ్చిమిర్చి 45, బజ్జీ మిర్చి 50, క్యాప్సికమ్ 60, పచ్చ కాకర 52, పందిరి బీర 45, క్యాబేజీ 19, క్యారెట్ 31, దొండ 28, గుండు బీన్స్ 40, గింజ చిక్కుడు 45, గోకరకాయ 50, కీర 17, దోసకాయ 28, బీట్‌రూట్ 17, ఉల్లిగడ్డ 23, ఆలుగడ్డ 19, చామగడ్డ 55, మొరంగడ్డ 23, కందగడ్డ 50, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4-6, ముల్లంగి 4-6. ఈ ధరలు నేటి(శనివారం) ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్‌పై అవగాహన



సికింద్రాబాద్: మెట్టుగూడ కూడలిలో ఆటో డ్రైవర్లకు శుక్రవారం చిలకలగూడ ట్రాఫిక్ పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ సీఐ సీహెచ్ శ్రీనివాసులు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో ట్రాఫిక్ నిబంధనలు వివరించారు.

'వితరణ'పై పోలీసుల తీరు సరికాదు



మాట్లాడుతున్న న్యాయవాదులు, బీజేపీ నాయకుడు శ్రీకాంత్

పద్మారావునగర్: అయోధ్య అక్షింతల వితరణ కార్యక్రమంలో భాగంగా నిర్వాహకులపై పోలీసులు వ్యవహరించిన తీరు సరికాదని హైకోర్టు న్యాయవాదులు శివప్రసాద్, కపిష్ తివారీ పేర్కొన్నారు. సికింద్రాబాద్ పాన్‌బజార్‌లో శుక్ర వారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ నాయకులు చీర శ్రీకాంత్‌తో కలిసి న్యాయవాదులు మాట్లాడారు. ఈ వ్యవహారంలో మోండా మార్కెట్ పోలీసులు పెట్టిన కేసును హైకోర్టు కొట్టివేసిందన్నారు.



కూకట్‌పల్లి జోనల్ నూతన కమిషనర్ అభిలాష అభినవ్‌ను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేశ్, బేగంపేట కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గౌరపల్లి రమేశ్ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి.. శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బేగంపేట డివిజన్‌లోని నాలాల కబ్జాలతో పాటు స్థానిక సమస్యలను వివరించారు.

వాడివేడిగా బోర్డు సమావేశం

'కంటోన్మెంట్'లో పలు సమస్యలపై చర్చ



బోర్డు సమావేశంలో పాల్గొన్న సభ్యులు

కంటోన్మెంట్: కారుణ్య నియామకాలకు ఓకే చెప్పడంతో పాటు అక్రమ నిర్మాణాలపై ఆస్తి పన్నులతో పాటు జరిమానాలు వసూలు చేయాలని కంటోన్మెంట్ బోర్డు నిర్ణయించింది. మరోవైపు అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణ కుదరదని యంత్రాంగం తేల్చి చెప్పగా.. క్రమబద్ధీకరిస్తేనే జరిమానా వేయాలని నామినేటెడ్ సభ్యుడు డిమాండ్ చేశారు. మొత్తానికి శుక్రవారం జరిగిన కంటోన్మెంట్ బోర్డు సమావేశం వాడి వేడిగా కొనసాగింది. బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ సోమ శంకర్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో సీఈఓ మధుకర్ నాయక్, జాయింట్ సీఈఓ ఆకాశ్‌కుమార్ శర్మ, నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ, ప్రత్యేక ఆహ్వానితురాలిగా ఎమ్మెల్యే లాస్య నందిత పాల్గొన్నారు.

సమావేశం జరిగిందిలా...

సమావేశం ప్రారంభానికి ముందే కంటోన్మెంట్‌కు శానిటేషన్ విభాగంలో రక్షణ మంత్రిత్వ శాఖ అవార్డు, గార్బేజ్ ఫ్రీ సిటీ అంశంలో స్టార్ రేటింగ్, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నాలుగో స్థానంలోకి రావడంపై అధ్యక్షుడు సోమశంకర్ అభినందనలు తెలిపారు. అనంతరం జరిగిన సమావేశంలో ఇళ్ల నల్లా కనెక్షన్లకు మీటర్లు పెట్టకుండా బోర్‌వెల్స్‌కు మీటర్లు బిగించడంపై బోర్డు సభ్యుడు రామకృష్ణ అభ్యంతరం తెలిపారు. ఈ మేరకు రూపొందించిన నూతన నిబంధనల అమలును నిలిపివేయాలని ఆయన కోరారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి పైపులైన్ల ప్రతిపాదనల రూపకల్పనలో ముందుగా సంబంధిత శాఖల మధ్య సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలని రామకృష్ణ కోరారు. ఈక్రమంలో మిలటరీ స్థలంలో వెలిసిన సాయిబాబా హట్స్‌కు తాగునీటి సదుపాయం కల్పించే ప్రతిపాదనలకు బోర్డు ఆమోదం తెలిపింది. మరోవైపు ఆశా ఆఫీసర్స్ కాలనీ నుంచి భవన్స్ కాలేజీ వరకు ఉన్న రోడ్డు పునర్నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి కోటి రూపాయల నిధులు అందించాలని ఎమ్మెల్యే లాస్య నందితను బోర్డు అధ్యక్షుడు కోరారు.

ఎమ్మెల్యే అభిప్రాయం అక్కర్లేదు

అక్రమ నిర్మాణాలకు సైతం ట్యాక్స్ అసెస్‌మెంట్ వర్తింపజేయాలని బోర్డు తీర్మానించింది. అయితే అక్రమ నిర్మాణాలకు జరిమానా విధింపుపై రామకృష్ణ అభ్యంతరం తెలిపారు. నిర్మాణాలను క్రమబద్ధీకరించకుండా జరిమానా విధించడం సరికాదని సూచించారు. బోర్డు నిబంధనల మేరకు క్రమబద్ధీకరణకు అవకాశం లేదని, జీహెచ్ఎంసీలో విలీనమైతే ఇది సాధ్యమని అధికారులు తేల్చి చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభిప్రాయంపై అధికారులు ప్రశ్నించగా.. ప్రత్యేక బోర్డులో ఆయనకు స్థానం లేదని రామకృష్ణ పేర్కొన్నారు. మరోవైపు అక్రమ నిర్మాణాల నిలుపుదలకు ఇచ్చే సెక్షన్ 248 నోటీసులు, నిర్మాణాల కూల్చివేతకు ఇచ్చే సెక్షన్ 320 నోటీసులకు ఒకేసారి బోర్డు అనుమతి తీసుకోవడం సరికాదని నామినేటెడ్ సభ్యుడు పేర్కొన్నారు.

కారుణ్య నియామకాలకు రంగం సిద్ధం

2010 నుంచి కంటోన్మెంట్‌లో కారుణ్య నియామకాలు చేపట్టలేదని సీఈఓ తెలిపారు. అయితే, ఇప్పటి వరకు 120 మంది ఇందుకోసం దరఖాస్తు చేసుకోగా తొలి విడతలో కేవలం 27 మందికి మాత్రమే ఉద్యోగాలిచ్చే అవకాశముందన్నారు. 5 శాతం నిబంధనను సవరించి మిగిలిన వారికి సైతం ఉద్యోగాలు ఇచ్చేందుకు అనుమతి ఇవ్వాల్సిందిగా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామన్నారు. వీటితో పాటు హస్మత్‌పేటలోని 28 ఎకరాల కంటోన్మెంట్ స్థలంలో ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్న ప్రతిపాదనపై బోర్డు సభ్యుడు రామకృష్ణ అభ్యంతరం తెలిపారు. చివరిగా త్వరలో రిటైర్ కానున్న ఆఫీస్ సూపరింటెండెంట్ స్థానంలో యాసీకి, హెల్త్ సూపరింటెండ్ స్థానంలో దేవేందర్‌కు పదోన్నతులు కల్పించేందుకు బోర్డు తీర్మానించింది.

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సనత్‌నగర్: బేగంపేట పాటిగడ్డలోని మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో పెండింగ్ పనులను పూర్తి చేసి వారంలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధికారులను ఆదేశించారు. మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌ను శుక్రవారం ఆయన వివిధ శాఖల అధికారులతో కలిసి సందర్శించారు. లిఫ్ట్ ఏర్పాటు, డ్రైనేజీ కనెక్షన్ పెండింగ్ ఉన్నాయని కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి, స్థానికులు మంత్రి దృష్టికి తీసుకురాగా, వెంటనే డ్రైనేజీ కనెక్షన్ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ ఫంక్షన్ హాళ్లను పేద, మధ్య తరగతి ప్రజలు సైతం వినియోగించుకునేలా అతి తక్కువ అద్దెకు ఇస్తున్నట్టు ఎమ్మెల్యే చెప్పారు. నిర్మాణం కోసం రూ.6 కోట్లతో జీ ప్లస్ టూ పద్ధతిలో నిర్మించినట్టు వివరించారు. అదేవిధంగా వడ్డెరబస్తీలో సీసీ రోడ్డు, దేవిడిలో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. ఓల్డ్ కస్టమ్స్ బస్తీలోని ఖబరస్థాన్ పనులను కూడా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ డీజీఎం శశాంక్, జీహెచ్ఎంసీ డీఈ సంతోష్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ క్రిస్టోఫర్, ఎలక్ట్రికల్ ఏఈ శ్రీనివాస్, జీహెచ్ఎంసీ ఏఈ తిరుమలేశ్, బీఆర్ఎస్ నాయకులు శ్రీహరి, నరేందర్‌రావు, శ్రీనివాస్ గౌడ్, శేఖర్, అక్బర్, పాటిగడ్డ గిరి, ఆరీఫ్, మొహిన్, అక్బర్, అఖిల్ అహ్మద్ ఉన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కంటోన్మెంట్: విద్యుత్ ఫీడర్ల మరమ్మతులు, ఇతర పనుల వల్ల కంటోన్మెంట్ డివిజన్ పరిధిలో శనివారం పలు చోట్ల విద్యుత్ కోతలు ఉంటాయని ఏడీఈ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మారేడుపల్లి రైల్వే కాలనీ, అల్వాల్ హెచ్ఎంటీ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు, నెహ్రూనగర్ ఎల్ఐసీ కాలనీ, అల్వాల్ భూపతిరావు నగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదు.

నేడు మర్రి చెన్నారెడ్డి జయంతి

లాలాపేట: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి 105వ జయంతిని శనివారం లాలాపేటలో నిర్వహించనున్నట్టు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎస్.రామ్‌లాల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు లాలాపేట చౌరస్తాలో కేక్ కటింగ్ అనంతరం అన్నదానం ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

ఓయూ హాస్టల్స్ నిర్వహణపై సీఎం ఆరా

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ హాస్టల్స్ నిర్వహణపై సీఎం రేవంత్‌రెడ్డి ఆరా తీసినట్టు సమాచారం. అంతేకాకుండా ఇటీవల ఓయూ క్యాంపస్ లేడీస్ హాస్టల్ ఘటనతో పాటు ఇతర హాస్టళ్ల నిర్వహణపై అధికారులను వివరణ కోరినట్టు తెలిసింది. ఈక్రమంలోనే ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ శుక్రవారం లేడీస్ హాస్టల్‌ను సందర్శించి విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు.

భక్తిశ్రద్ధలతో కూడారవల్లి ఉత్సవం



ఆలయంలో పూజలు చేస్తున్న పండితులు

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్ శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం కూడారవల్లి ఉత్సవం, కుంకుమపూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పద్మావతి, గోదా సమేత ప్రసన్న వెంకన్న స్వామి ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించారు. కుంకుమ పూజ, పాశుర పఠనం, ప్రాతరారాధన కార్యక్రమాల్లో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. రేపు(ఆదివారం) ఉదయం 9 గంటలకు ఆలయంలో గోదాదేవి కల్యాణం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షుడు బసవరాజు శ్రీనివాస్, వేణుగోపాలరావు, ఈఓ రాజేశ్‌కుమార్‌లు తెలిపారు. అనంతరం మరింగంటి విజయకుమార్ ఆలపించిన తిరుప్పావై ప్రవచనాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు బాలభాస్కర్, ఆత్మరామ సూర్య సుబ్రహ్మణ్యం, నారాయణన్, శివ శంకరన్, సుజయ్‌ప్రకాశ్, రామచందర్ పాల్గొన్నారు.

19 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

సనత్‌నగర్: బేగంపేట పోలీసులు శుక్రవారం 19 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. వీరిలో ఎనిమిది మందికి జరిమానా విధించారు. మొదటిసారి పట్టుబడ్డ ఆరుగురికి రూ.2,100 జరిమానాతో పాటు రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ నాంపల్లి ఏడో ఎంఎం కోర్టు తీర్పు ఇచ్చినట్టు బేగంపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాపయ్య తెలిపారు. రెండోసారి పట్టుబడిన ఐదుగురికి రూ.3,300 జరిమానాతో పాటు నాలుగు రోజుల జైలు శిక్ష విధించారు.

సీసీఎంబీలో విద్యార్థుల పరిశోధనలు



సీసీఎంబీలోని కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు

లాలాపేట: నగరంలోని సెంటర్ ఫర్ సెల్యూలర్ అండ్ మాలిక్యూలర్ బయాలజీ(సీసీఎంబీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యంగ్ ఇన్నోవేటర్స్ ప్రోగ్రాం(వైఐపీ) శుక్రవారంతో ముగిసింది. కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ పాఠశాలలకు చెందిన 27 మంది విద్యార్థులు ఎంపిక కాగా వారికి ఈ నెల 3 నుంచి 12 వరకు సీసీఎంబీలో సైన్స్ పరిశోధనలు చేసే అవకాశం లభించింది. ఇదిలా ఉండగా శుక్రవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ వినయ్ కె నందికూరి విద్యార్థులు ఉద్దేశించి మాట్లాడారు. తల్లిదండ్రులుగా తమ పిల్లలను ఇంజినీరింగ్, మెడిసిన్‌పైనే ఫోకస్ పెట్టేలా కాకుండా వారు కోరుకునే రంగంలో రాణించేలా అవకాశం ఇవ్వాలన్నారు. 10 రోజులుగా సీసీఎంబీలో నేర్చుకున్న విషయాలు నిత్య జీవితంలో ఉపయోగపడేలా ఉన్నాయని చెప్పారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు.

ఎన్ఎస్ఎస్ శిబిరానికి జాహేదా ఎంపిక



డాక్టర్ జాహేదా బేగం

ఉస్మానియా యూనివర్సిటీ: హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ అధ్యాపకురాలు డాక్టర్ జాహేదా బేగం ఎన్ఎస్ఎస్ జాతీయ శిబిరానికి ఎంపికయ్యారు. ఈ నెల 14 నుంచి 20 వరకు నగరంలోని ఎంఎల్ఆర్ కాలేజీలో జరిగే ఈ శిబిరానికి ఓయూ కాంటిజెంట్ లీడర్‌గా ఆమె హాజరవుతారు.

రెండుచోట్ల 48 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయి బ్యాగ్‌లను చూపిస్తున్న ఎక్సైజ్ అధికారులు

సనత్‌నగర్: ఒడిశా నుంచి నగరానికి తరలించిన 48 కిలోల ఎండు గంజాయిని సికింద్రాబాద్ ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్ ఎక్సైజ్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ పవన్‌కుమార్ వివరాలు తెలిపారు. సమాచారం మేరకు ఈ నెల 11న అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఎక్సైజ్ సీఐ జగన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పరిసరాల్లో తనిఖీలు చేపట్టారు. స్టేషన్ ఆవరణలోని ఆటోస్టాండ్ వద్ద ముగ్గురు వ్యక్తులు లగేజీతో అనుమానాస్పదంగా కనిపించడంతో తనిఖీ చేశారు. నాలుగు బ్యాగ్‌లలో 40 కిలోల ఎండు గంజాయి బయటపడింది. సరుకుతో పాటు రెండు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు అరకు ప్రాంతం లోతేరు గ్రామానికి చెందిన పంగి జోగినాయుడు(28), అతని భార్య పూజారి లావణ్య(22), తల్లి పంగి కిరోమణిగా గుర్తించారు. కిలో రూ.2,050కు కొనుగోలు చేసి నగరంలో రూ.20 వేలకు విక్రయిస్తారని పోలీసులు తెలిపారు. మొత్తంగా 10 లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకొని ముగ్గురిని రిమాండ్ చేశారు.

మరో కేసులో ఇంకొకరు..

డీటీఎఫ్ సికింద్రాబాద్ సీఐ శివజ్యోతి ఆధ్వర్యంలో డీటీఎఫ్ సిబ్బంది సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పరిసరాల్లోని మాతాగుడి వద్ద తనిఖీలు నిర్వహించారు. బిహార్‌కు చెందిన వివేక్‌సాహ్ని(22) నుంచి రూ.2 లక్షల విలువైన ఎనిమిది కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇతను కూడా ఒడిశా నుంచి గంజాయి తీసుకొచ్చి నగరంలో విక్రయించేందుకు ప్లాన్ చేసినట్టు విచారణలో ఒప్పుకున్నాడు. దాడుల్లో సీఐ జగన్‌మోహన్‌రెడ్డి, శివజ్యోతి, ఎస్ఐ నవనీత, ప్రేమ్‌కుమార్‌రెడ్డి, నరేశ్ పాల్గొనగా వారిని సూపరింటెండెంట్ పవన్‌కుమార్ అభినందించారు.

'సాక్షి' వార్తకు స్పందన

సాక్షి ఎఫెక్ట్..

సికింద్రాబాద్: 'నిత్యం ట్రాఫిక్ చిక్కులే' శీర్షికన 'సాక్షి'లో ఈ నెల 12న ప్రచురితమైన కథనానికి చిలకలగూడ ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. సీఐ శ్రీనివాసులు నేతృత్వంలో అధికారులు, సిబ్బంది సీతాఫల్‌మండి కూడలి నుంచి వారాసీగూడ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రహదారులకు ఇరువైపులా పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు.



సీతాఫల్‌మండిలో వాహనాలు స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు



ర్యాలీలో పాల్గొన్న కావ్యరెడ్డి

వివేకానందుడు ఆదర్శం

అమీర్‌పేట: జాతీయ యూత్ డే సందర్భంగా స్వామి వివేకానంద జయంతిని ప్రజలతో పాటు బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. బల్కంపేట నుంచి అమీర్‌పేట వరకు 400 మంది యువకులతో చేపట్టిన ర్యాలీని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి సతీమణి కావ్యరెడ్డి ప్రారంభించారు. అనంతరం చాయ్ పే చర్చ కార్యక్రమంలో పాల్గొన్నారు. సునీల్, సాయి రాథోడ్, గోవింద్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

లాలాపేటలో...

లాలాపేట: దేశ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన స్వామి వివేకానందుని నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలనీ మాజీ మేయర్ బండ కార్తీకచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం లాలాపేటలోని స్వామి వివేకానందుడి విగ్రహానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నేతి రాములు గుప్త, ఆర్ఎస్ఎస్ నాయకులు కృష్ణప్రసాద్, శ్రీనివాస్, వినయ్, ప్రభాకర్, ఈశ్వర్, గోపాల్‌చారి, హరీశ్‌చంద్ర, సునీల్ అన్నోజి శ్రీనివాస్, కిరణ్‌కుమార్ గౌడ్, పంచముఖి ప్రసాద్, కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

నామాలగుండులో..

చిలకలగూడ: ప్రావీణ్యం స్వచ్ఛంద సంస్థ నేతృత్వంలో నామాలగుండులో నేషనల్ యూత్ డే వేడుకలు నిర్వహించారు. అమరావతి విద్యాసంస్థల నిర్వాహకులు ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త చందర్, ప్రావీణ్యం సంస్థ ప్రతినిధులు ప్రశాంత్, శివకుమార్, గోపికృష్ణ, భరత్, మురళీకృష్ణ, తాతారావు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

సనత్‌నగర్: బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో యువజన దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వివేకానంద రాక్ మెమోరియల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవంలో భాగంగా భారత్-2047 అనే అంశంపై విద్యార్థులు 15 గ్రూపులుగా పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఇందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన గ్రూప్‌లకు ప్రతిభా సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి, వైస్ ప్రిన్సిపాల్ వసుధ, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ ఆనీషెరాన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సరిత, డాక్టర్ సరోజినీ చక్రవర్తి, డాక్టర్ ప్రసన్న, డాక్టర్ నర్సింహులు, డాక్టర్ మధుకర్, సంస్థ నిర్వాహకులు మీనాక్షి, రవినాయుడు, ఆనంద్, కళాశాల ఆచార్యులు డాక్టర్ ఎం.నిర్మల పాల్గొన్నారు.

గాంధీ ఆస్పత్రిలో..


గాంధీ ఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో వివేకానంద జయంతి ఘనంగా జరిగింది. వివేకానందుడి ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. గాంధీ సూపరింటెండెంట్ రాజారావు, డిప్యూటీలు శోభన్‌బాబు, నర్సింహరావునేత, ఆర్ఎంఓ-1 జయకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

లష్కర్‌లో బీజేవైఎం బైక్‌ర్యాలీ

సికింద్రాబాద్: జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం బీజేవైఎం నాయకుడు భాస్కర్‌గిరి నేతృత్వంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాన్ని వారాసీగూడ శివాజీ విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేకల సారంగపాణి, రాచమల్ల కృష్ణమూర్తి, పి.రవిప్రసాద్‌గౌడ్, కందాడి నాగేశ్వరరెడ్డి, కనకట్ల హరి, బీజేవైఎం నాయకులు భరత్, సందీప్, గంగాధర్, వేణు, సాయినాథ్, అజయ్ ఉన్నారు.



లాలాపేటలో నివాళి అర్పిస్తున్న బండ కార్తీకరెడ్డి



పాఠశాలల్లో సంక్రాంతి సంబురాలు



హిందూ పబ్లిక్ స్కూల్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు

సనత్‌నగర్: హిందూ పబ్లిక్ స్కూల్‌లో పల్లె సంస్కృతి వెల్లివిరిసింది. సంప్రదాయ వస్త్రాలతో విద్యార్థులు సంక్రాంతి సంప్రదాయాన్ని ఆవిష్కరించారు. కోలాటాలు.. గంగిరెద్దుల విన్యాసాలు.. భోగి పండ్లు.. భోగి మంటలతో పండుగ వాతావరణం తలపించారు. స్వామి వివేకానంద సేవా సమితి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ శ్యాంసుందర్ గౌడ్, ప్రతినిధులు హెచ్ఎన్ త్రిపాఠి, చంద్రశేఖర్ గుప్తా, ప్రిన్సిపాల్ రాధిక తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అమరావతి పాఠశాలలో..

చిలకలగూడ: నామాలగుండు అమరావతి టాలెంట్ స్కూల్‌లో శుక్రవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు వేసిన రంగవల్లులు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు పతంగులు ఎగురవేసి, ఆటపాటలతో సందడి చేశారు. విజేతలకు బహుమతులు అందించారు. తెలంగాణ సంస్కృతిపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు అన్ని పండుగలు నిర్వహిస్తామని పాఠశాల ప్రిన్సిపాల్ ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో..



అమరావతి పాఠశాలలో సంబరాలు

బన్సీలాల్‌పేట్: డివిజన్ పరిధిలోని భోలక్‌పూర్ క్రిస్టానగర్‌లో మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మల్లికార్జున్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ మారేడ్‌పల్లి, సికింద్రాబాద్ ఆధ్వర్యంలో పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వైసీ సుంకి, క్లబ్ అధ్యక్షుడు సుధాకర్, డిమ్మి, రఘువర్మ పాల్గొన్నారు.

భోలక్‌పూర్‌లో ముగ్గుల పోటీలు

పద్మారావునగర్: సంక్రాంతిని పురస్కరించుకొని భోలక్‌పూర్‌లో శుక్రవారం కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కె.హేమలత, పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ మంచాల శ్రీనివాసులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379